
సాక్షి ఒడిశా

గురువారం । 2, ఫిబ్రవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4.92.857లు, బంగారం 13.4 గ్రాములు, వెండి 48.35 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి -18లో



అటానమస్ కళాశాలలో క్రీడోత్సవాలు -18లో

న్యూస్‌రీల్

చిల్డ్రన్ హోంలో అదనపు న్యాయమూర్తి



బాలల సంరక్షణాలయంలో అధికారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి విఘ్నేశ్వరరావు

జయపురం: పట్టణంలోని పారాబెడలో ఉన్న చిల్డ్రన్ హోంను జిల్లా అదనపు న్యాయమూర్తి విఘ్నేశ్వరరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఆశ్రయం పొందుతున్న చిన్నారులతో మాట్లాడారు. వారి ఆరోగ్యం, విద్య, వసతి సౌకర్యాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉత్తమ నాగరికులుగా ఎదగాలని ఉద్బోధించారు. అలాగే పారిశుద్ధ్య నిర్వహణ, ఆహారం తదుతర సదుపాయాలపై ఆరా తీశారు. సబ్ కలెక్టర్ దేవధర ప్రధాన్ చిల్డ్రన్ హోం విస్తరణకు చేపడుతున్న పనులను వివరించారు. పరిశీలనలో జయపురం బీడీఓ రాజీవ్ దాస్, జిల్లా శిశు మంగళ సమితి అధ్యక్షురాలు గాయత్రీ దాస్, అధికారులు రాజశ్రీ దాస్, కె.నిషా, వైద్యులు డాక్టర్ దుర్గాప్రసాద్ పాత్రొ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, చిల్డ్రన్ హోం అధికారి లింగరాజ్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

10న రాష్ట్రపతి ముర్ము రాష్ట్ర పర్యటన



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

భువనేశ్వర్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 2రోజుల రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఈ సందర్భంగా జంట నగరాలు భువనేశ్వర్, కటక్ ప్రాంతాల్లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనున్నారు. ఈనెల 10నుంచి ఈ పర్యటన ప్రారంభం కానుండగా, ప్రత్యేక విమానంలో ఆ రోజు ఉదయం 11:45 గంటలకు భువనేశ్వర్ చేరుకోనున్నారు. సాయంత్రం 4:15 గంటలకు జరిగే రమాదేవి మహిళా విశ్వ విద్యాలయం ద్వితీయ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొనున్నారని, వైస్ ఛాన్సలర్ అపరాజితా చౌదరి ప్రకటించారు. రాష్ట్రపతి స్థానిక వర్సిటీలో పూర్వ విద్యార్థి కావడం విశేషం. రాజ్‌భవన్‌లో రాత్రి బస చేస్తారు. 11న ఉదయం 9:15 గంటలకు ఏకామ్ర క్షేత్రంలో లింగరాజు స్వామివారిని దర్శించుకోనున్నారు. అనంతరం కటక్ ఐసీఏఆర్ నిర్వహించే ద్వితీయ భారతీయ వరి కాంగ్రెస్ కార్యక్రమంలో పాల్గొంటారు. రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆమె రెండోసారి రాష్ట్ర పర్యటనకు విచ్చేస్తున్నారు. 2022 నవంబర్‌లో తొలిసారిగా ఒడిశాను సందర్శించారు.

ఝార్సుగుడ స్థానం ఖాళీ

భువనేశ్వర్: రాష్ట్రంలో ఝార్సుగుడ శాసనసభ స్థానం ఖాళీ అయ్యిందని జాతీయ ఎన్నికల కమిషన్‌కు తెలియజేశారు. ఈ స్థానం ప్రతినిధి, రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన నవకిషోర్ దాస్ ఇటీవల అకాల మరణానికి గురి కావడంతో ఈ పరిస్థితి నెలకొందని శాసనసభ కార్యదర్శి ఎన్నికల కమిషన్, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) కార్యాలయాలకు తెలియజేశారు. ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు ఝార్సుగుడ అసెంబ్లీ స్థానం భర్తీ నిమిత్తం ఉప ఎన్నిక ప్రక్రియకు శ్రీకారం చుడతారు.

ప్రభాత్‌కుమార్ సేవలు చిరస్మరణీయం



ప్రభాత్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జయపురం: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ప్రభాత్‌కుమార్ రథ్ విద్యాప్రగతికి అందించిన సేవలు చిరస్మరణీయమని హెచ్‌ఎంలు ప్రకాశ్ పట్నాయక్ కొనియాడారు. స్థానిక పాఠశాల ఉపాధ్యాయుడు రథ్ ఉద్యోగ విరమణ సందర్భంగా అభినందన సభ బుధవారం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా హెచ్‌ఎంలు మాట్లాడుతూ రథ్ పాఠశాలలో అందరితో కలసిమెలసి ఉండేవారని, విద్యార్థులకు బోధనలో ప్రత్యేక శ్రద్ధ వహించేవారన్నారు. ఆయన రిటైర్డ్ కావడం విద్యార్థులకు తీరని లోటని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడిని జ్ఞాపికలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భగవాన్ సాబత్, విశ్వరంజన్ గౌఢ, దేవేంద్రకుమార్ పాఢి, సుజిత్‌కుమార్ నాయక్, వనిత శత్పతి, సాగరిక పాత్రొ, రశ్మిత నాయక్, శుభశ్రీ సాహు, సువర్ణకుమారి ఖీలో తదితరులు పాల్గొన్నారు.

● అవగాహన..



జిల్లా న్యాయ సేవా ప్రాధికరణ సంస్థ ఆధ్వర్యంలో జయపురం సమితి ఎకంబా పంచాయతీ కెందుగుడ గ్రామంలో కిన్నెరులకు న్యాయ అవగాహన శిబిరం నిర్వహించారు. ఇందులో సంస్థ జిల్లా కార్యదర్శి సుమన్ జెనా మాట్లాడుతూ న్యాయచట్టంలో కిన్నెరులకు కల్పిస్తున్న హక్కులు, మౌలిక అధికారాలు, భద్రత అంశాలను వివరించారు. వారు సమాజంలో గౌరవంగా ఉపాధి ఏర్పరచుకొనేందుకు మరింత ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, సహాయ పథకాలను సక్రమంగా అందించాలన్నారు. ప్రభుత్వ న్యాయవాది డాక్టర్ గాయిత్రీదేవి, ఏఎస్ఐ గణేష్‌ప్రసాద్ బెహరా పాల్గొన్నారు.

- జయపురం

● ఆపద..



మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి పప్పలూర్ పంచాయతీ లోనయినగుడకు చెందిన భాను సిసా(28)కు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అయితే రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గ్రామానికి చేరుకోలేమని సిబ్బంది బదులిచ్చారు. దీంతో భర్త రామచంద్ర, ఆశా కార్యకర్త, బంధువులు కలిసి సిసాను డోలీలో కూర్చోబెట్టి, కాలినడకన ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. అయితే మర్గం మధ్యలోనే ఆమె మగబిడ్డను ప్రసవించగా, పప్పలూర్ నుంచి వాహనంలో చిత్రకొండ తరలించారు. ప్రాణాపాయం లేదని వైద్యులు చెప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

- మల్కన్‌గిరి

● అంధకారం..



రాయగడ పట్టణంలోని జగన్నాథ మందిరం అంధకారంలో కొట్టుమిట్టాడుతోంది. విద్యుత్ బిల్లు బకాయి ఉండటంతో సంబంధిత శాఖ అధికారులు సరఫరాను నిలిపివేశారు. గత కొన్నాళ్లుగా విద్యుత్ బకాయి చెల్లించక పోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని ప్రకటించారు. సుమారు రూ.5 లక్షల వరకు బకాయి ఉన్నట్లు సమాచారం. ఈ విషయమై జగన్నాథ మందిరం పరిచాలన కమిటీ నోరు మెదపడం లేదు. అయితే అంధకారంలోనే స్వామివారిని దర్శించుకోవడం దురదృష్టకరమని భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సమస్యపై కమిటీ సత్వరంగా స్పందించాలని కోరుతున్నారు.

- రాయగడ

ఎత్తిపోతల పథకాలకు శ్రీకారం

- చిన్ననీటి పారుదలశాఖ ఎస్ఈ జగన్నాథ్
- ప్రారంభమైన సాగునీటి పంచాయతీ పక్షోత్సవాలు



పాణి పంచాయతీ సమావేశానికి హాజరైన రైతులు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ జగన్నాథ్

పర్లాకిమిడి: జిల్లాలో ప్రస్తుతం చిన్ననీటి పారుదలశాఖ ఆధ్వర్యంలో 74 సాగునీటి పాయింట్లు నిర్వహిస్తున్నామని, 147 జలాశయాలను పునరుద్ధరిస్తున్నామని చిన్న నీటి పారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.జగన్నాథ్ తెలిపారు. కొత్తగా 4 డివిజన్లలో మరో వెయ్యి హెక్టార్ల సాగునీరు అందించే లక్ష్యంతో ఎత్తిపోతల పథకం పనులకు శ్రీకారం చుట్టనున్నామని వెల్లడించారు. దీనికి సంబంధించి నాబార్డు నిధులు వినియోగించనున్నామన్నారు. జిల్లాలో పాణి పంచాయతీ(సాగునీటి పంచాయతీ) పక్షోత్సవాలను పర్లాకిమిడి ఎత్తిపోతల శాఖ డివిజన్ కార్యాలయంలో ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ సుశాంత రంజన్‌దాస్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీటి పక్షోత్సవాలు ఈనెల 15 వరకు వివిధ మండల స్థాయిలో జరగనున్నట్లు వెల్లడించారు. సాగునీటి పంచాయతీల పక్షోత్సవాల అధ్యక్షుడు, కార్యనిర్వాహక ఇంజినీర్ రామచంద్ర బెహరా మాట్లాడుతూ జిల్లాలోని 7 మండలాల్లో 67 పాణి పంచాయతీలు పని చేస్తున్నాయని తెలిపారు. రైతులకు సాగునీటిని ఎత్తిపోతల పథకాల పాయింట్ల నుంచి మోటారు ద్వారా అందిస్తున్నామన్నారు. మరో 300 పాణి పంచాయతీలు రిజిస్టర్ చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన, పెయింటింగ్, క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ పీడీ సురేష్‌కుమార్ పట్నాయక్, జిల్లా ముఖ్య వ్యవసాయశాఖ అధికారి కైలాష్‌చంద్ర బెహరా, ఏఈ నిరంజన్ భుయాన్, ఏఈ బీరేంద్రకుమార్ సాహు, చిన్ననీటి పారుదల శాఖ ఏఈ సుశాంత్‌కుమార్ మిశ్రా(కాశీనగర్), రైతులు పాల్గొన్నారు.

జస్టిస్ జేపీ దాస్‌కు పర్యవేక్షణ బాధ్యతలు



పార్లమెంట్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న బీజేడీ ఎంపీలు



జస్టిస్ జేపీ దాస్

- మంత్రి నవకిషోర్ దాస్ హత్య కేసు దర్యాప్తుపై నిర్ణయం

భువనేశ్వర్: రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి నవకిషోర్ దాస్ హత్య ఘటనపై అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఏడీజీ అరుణ్‌బొత్రా ఆధ్వర్యంలో క్రైంశాఖ దర్యాప్తు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ దర్యాప్తు పర్యవేక్షణకు హైకోర్టు సిట్టింగ్ లేదా రిటైర్డ్ జడ్జిని నియమించాలని రాష్ట్రప్రభుత్వం ఇటీవల అభ్యర్థించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఒడిశా హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ జేపీ దాస్‌ను పర్యవేక్షకులుగా నియమించారు. దాస్ 2015 ఏప్రిల్ 17 నుంచి 2019 సంవత్సరం మే 19వరకు ఒడిశా హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించారు. అంతకుముందు ఖుర్దా జిల్లా సెషన్స్ కోర్టులో జడ్జిగా పని చేశారు. ఏఎస్ఐ గోపాల్ కృష్ణదాస్ మంత్రిని రివాల్వర్‌తో కాల్చి చంపిన కేసుపై క్రైంబ్రాంచ్ విచారణ సరికాదని ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెసు పార్టీలు ఆరోపిస్తున్నారు. దర్యాప్తు పారదర్శకత కోసం సీబీఐకి అప్పగించాలని బీజేపీ నాయకులు, ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)కు దర్యాప్తుకు కాంగ్రెస్ డిమాండ్ చేస్తున్నాయి.

బీజేడీ ఎంపీల శ్రద్ధాంజలి

భువనేశ్వర్: దివంగత మంత్రి నవకిషోర్ దాస్‌కు బిజూ జనతాదళ్ పార్లమెంట్ సభ్యులు బుధవారం నివాళులర్పించారు. పార్లమెంట్ బడ్జెటు సమావేశాలు ఆరంభానికి ముందు ఢిల్లీలోని బీజేడీ పార్లమెంట్ కార్యాలయంలో మౌనం పాటించి, శ్రద్ధాంజలి ఘటించారు.

మంత్రి పీఎస్ఓపై వేటు

దివంగత మంత్రి కిషోర్‌దాస్ హత్య కేసులో నిందితులకు వ్యతిరేకంగా చురుగ్గా చర్యలు చేపడుతున్నారు. ఆయన వ్యక్తిగత రక్షణ అధికారి(పీఎస్ఓ) మిత్రభాను దేవ్‌ను విధుల నుంచి తాత్కాలికంగా తొలగించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం ఆరోపణలపై దేవ్‌కు బుధవారం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే బ్రజరాజ్ నగర్ ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జి(ఐఐసీ) ప్రద్యుమ్న కుమార్‌ను సంబల్‌పూర్ జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్‌కు బదిలీ చేశారు. గాంధీ చక్ ఔట్‌పోస్ట్ సబ్ ఇన్‌స్పెక్టర్(ఎస్ఐ) శశిభూషణ్ పోఢ్‌కు సోన్‌పూర్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి, ధవళేశ్వర్ సాహు సంబల్‌పూర్ నుంచి ఝార్సుగుడ ఐఐసీగా నియమితులయ్యారు.

42 ఎకరాల్లో గంజాయి సాగు ధ్వంసం



గంజాయి పంటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి కుర్మానూర్ పంచాయతీ కెందుగూడ గ్రామంలో కొండలపై గంజాయి సాగు చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు కలిమెల పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది, బీఎస్ఎఫ్ జవాన్లు బుధవారం దాడులు చేశారు. ఇందులో 42 ఎకరాల్లో గంజాయిని గుర్తించి, 63వేల మొక్కలను తొలగించారు. అనంతరం నిప్పంటించారు. వీటి విలువ రూ.6 కోట్లు ఉంటుందని కలిమెల పోలీసులు తెలిపారు.

నిరాశకరంగా కేంద్ర బడ్జెట్

- కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్కా



కొరాపుట్: కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జట్ అత్యంత నిరాశకరంగా ఉందని కొరాపుట్ పార్లమెంట్ సభ్యుడు సప్తగిరి ఉల్కా అసంతృప్తి వ్యక్తంచేశారు. బుధవారం కొరాపుట్ సాక్షి ప్రతినిధితో ఫోన్లో మాట్లాడిన ఆయన.. ఇది కేవలం సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రవేశ పెట్టిన బడ్జెట్‌గా అభివర్ణించారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం వంటి సమస్యలపై ఎటువంటి చర్యలు లేవన్నారు. జీఎస్టీలో పెరుగు, పాలు, డైపర్ వంటి నిత్యావసర వస్తువులపై సమాధానం లేదని విమర్శించారు. రైల్వేపై స్పష్టమైన వివరాలు లేవని, జయపురం-మల్కన్‌గిరి, జయపురం-నవరంగ్‌పూర్, గుణుపూర్-తెరువల్లి, బొలంగీర్-ఖుర్దా రైల్వేలైన్ల నిర్మాణం, రాయగడ రైల్వే డివిజన్ సంగతి లేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ ఏడాది జరగనున్న కర్ణాటక ఎన్నికల నేపథ్యంలో అక్కడికి అధిక నిధులు కేటాయించారని, ఒడిశాకు మాత్రం ప్రత్యేక ప్యాకేజీ లేదన్నారు. ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి ఊసే లేదని, తాజా బడ్జెట్‌తో దేశాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టేస్తున్నారని ఆరోపించారు. కేవలం ఆదాయ పన్ను విషయాన్ని మాత్రమే స్వాగతిస్తున్నట్లు ప్రకటించారు.

వృద్ధురాలి మెడలో గొలుసు అపహరణ

రాయగడ: పట్టణంలోని ట్రెజరీ రోడ్డు వద్ద బుధవారం ఉదయం ఓ వృద్ధురాలి మెడలో బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగులు అపహరించారు. తెలుపురంగు అపాచీ బైక్‌పై హెల్మెట్ లను ధరించిన ఇద్దరు వ్యక్తులు 3తులాల బంగారు గొలుసును ఎత్తుకుపోయారు. ఘటనకు సంబంధించి పోలీసులకు సమాచారం అందడంతో అక్కడికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక బ్రాహ్మణ వీధిలో ఉంటున్న సంజుక్త బక్షిపాత్రొ64) ఎప్పటిలాగే సమీపంలోని జగన్నాథ మందిరానికి వెళ్లి, స్వామి దర్శనానంతరం ఇంటికి తిరిగి వస్తుండగా ఇద్దరు దుండగులు ఈ దోపిడికి పాల్పడ్డారు. ట్రెజరీ రోడ్డు వద్ద ఉన్న కిరాణి దుకాణంలో అమర్చబడిన సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు దుండగుల ఫొటోలను సేకరించారు. బైక్‌పై ఇద్దరు వ్యక్తులు 2సార్లు రోడ్డు పరిసరాలను తిరిగిన అనంతరం అదే రోడ్డు మీదుగా వస్తున్న సంజుక్త బక్సిపాత్రొ మెడలో గొలుసు తెంపుకుని పరారైనట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తరచూ ఇటువంటి ఘటనలు పట్టణంలో చోటు చేసుకుంటుండటంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

సీఎం పర్యటన రేపు



ప్లాటినమ్ జూబ్లీ ఉత్సవాలకు జరుగుతున్న ఏర్పాట్లు

- జయపురం కళాశాల 75వ వార్షికోత్సవాలకు హాజరుకానున్న సీఎం నవీన్

జయపురం: పట్టణంలోని స్వయంపాలిత విక్రమదేవ్ కళాశాల 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించనున్న ప్లాటినమ్ జూబ్లీ ఉత్సవాలలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పాల్గొనున్నారు. షెడ్యూల్ ప్రకారం జనవరి 31న ఆయన హాజరై, ఉత్సవాలను ప్రారంభించాల్సి ఉండగా.. రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి నవకిషోర్ దాస్ ఆకస్మిక మృతితో పర్యటన రద్దయ్యింది. ఈ నేపథ్యంలో ఉత్సావాలను ఈనెల 3కి వాయిదా వేసినట్లు నిర్వహకులు వెల్లడించారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం 11.30గంటలకు భువనేశ్వర్ నుంచి ముఖ్యమంత్రి సభా వేదికకు చేరుకుంటారని తెలిపారు. అక్కడ మిషన్‌శక్తి గ్రూప్ సభ్యులు ఆయనను సన్మానించనున్నారు. 11.33 గంటలకు కొరాపుట్ ఎమ్మెల్యే, జిల్లా ప్రణాళికా బోర్డు చైర్మన్ రఘురాం పడాల్ స్వాగత, 11.37 గంటలకు కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ హల్దార్, 11.41 గంటలకు జయపురం ఎమ్మెల్యే, ప్లాటినమ్ జూబ్లీ నిర్వహక కమిటీ చైర్మన్ తారాప్రసాద్ బాహిణీపతి ప్రసంగించనున్నారు. 11.45 గంటలకు కొరాపుట్ జిల్లాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులపై వీడియో స్క్రీనింగ్, 11.49 గంటలకు కొరాపుట్ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మిత మెలక, 11.53 గంటలకు విద్యాశాఖ మంత్రి రోహిత్ పూజారి, 11.57 గంటలకు ఎస్టీ, ఎస్సీ అభివృద్ధి, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక మాట్లాడనున్నారు. 12.01 గంటలకు వివిధ అభివృద్ధి ప్రాజెక్టు లకు సంబంధించి శంకుస్థాపన చేయనున్న సీఎం.. 12.03 గంటలకు మిషన్‌శక్తి స్వయం సహాయక గ్రూపులకు వడ్డీలేని రుణాలు అందజేయనున్నారు. 12.06 గంటలకు కళాశాల ప్రస్థానంపై సావనీర్, జిల్లా టూరిజంపై పోస్టల్ కవర్ విడుదల చేయనున్నారు. 12.09 గంటలకు ముఖ్యమంత్రి నవీన్ ప్రసంగం, అనంతరం కళాశాల అల్యూమిన అసోసియేషన్ సభ్యుల సన్మానం జరగనుంది. కొరాపుట్ ఎస్‌డీసీ చైర్మన్ చంద్రశేఖర మాఝి కృతజ్ఞతా ప్రకటన అనంతరం 12.20 గంటలకు దసరా పాడియాలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకొని, అక్కడి నుంచి సీఎం భువనేశ్వర్‌కు పయనమవుతారు.

రోడ్డు నిర్మాణానికి ఆంధ్ర సన్నాహాలు

- అడ్డుకున్న పొలమతులసి గ్రామస్తులు
- సరిహద్దులు నిర్ణయించిన ఒడిశా అధికారులు



ఒడిశా సరిహద్దు బోర్డును ఏర్పాటు చేస్తున్న అధికారులు, గ్రామస్తులు



మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

రాయగడ: ఆంధ్ర, ఒడిశా సరిహద్దు పొలమతులసి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ అధికారులు చేపట్టిన రహదారి నిర్మాణాన్ని గ్రామస్తులు వ్యతిరేకించారు. ఒడిశా సరిహద్దులో ఆంధ్రా అధికారులు చొరబాటు చేస్తున్నారని గ్రామస్తులు జిల్లా యంత్రాంగానికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో స్పందించిన అధికారులు.. సరిహద్దులో పర్యటించి ఒడిశాకు సంబంధించిన భూభాగంలో హద్దులు వేస్తూ సూచిక బోర్డును ఏర్పాటు చేసింది. వివరాల్లోకి వెళ్తే.. సదర్ సమితి పొలమతులసి గ్రామం ఆంధ్ర, ఒడిశా సరిహద్దులో ఉంది. కొద్దిరోజుల క్రితం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అధికారులు సుమారు 500 మీటర్ల మేర ఒడిశా సరిహద్దులో ప్రవేశించి రహదారి నిర్మాణానికి సన్నహాలు చేశారు. దీనిపై గ్రామస్తులు వ్యతిరేకం వ్యక్తం చేయడంతో పనులు నిలిచిపోయాయి. విషయం జిల్లా యంత్రాంగం దృష్టికి రాగా స్పందించిన కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్.. సమస్యను పరిష్కరించేందుకు సమితి బీడీఓ లక్ష్మీనారాయణ సాబత్, తహసీల్దార్ తపస్‌రాత్ లను ఆదేశించారు. ఈ క్రమంలో అధికారులు సరిహద్దు పొలమతులసి గ్రామంలో పర్యటించారు. మద్రాస్ ప్రెసిడెన్సీ హయాంలోని మ్యాప్‌ల ఆధారంగా రెవెన్యూ, అటవీశాఖ భూభాగ మ్యాప్‌లను పరిశీలించిన అధికారులు.. ఎటువంటి అనుమతులు లేకుండా ఒడిశాలోని సుమారు 500 మీటర్ల మేర ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రహదారి నిర్మించేందుకు ప్రయత్నించినట్లు తేల్చారు. ఈ క్రమంలో రాష్ట్ర సరిహద్దుకు సంబంధించి గ్రామస్తుల సహకారంతో సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. దీనిపై ఆంధ్ర అధికారుల నుంచి ఇప్పటి వరకు ఎటువంటి ప్రతిస్పందన లేదు.

క్లుప్తంగా

కొరియాలో కొరాపుట్ ఏడీఎం పర్యటన



సాగునీటి పథకాలు పరిశీలిస్తున్న ఏడీఎం ప్రధాన్

కొరాపుట్: ఆంధ్రా–ఒడిశా వివాదాస్పద ప్రాంతం కొరియాలో జిల్లా అదనపు మెజిస్ట్రేట్ రామేశ్వర్ ప్రధాన్ బుధవారం పర్యటించారు. కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి కొరియా పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలను సందర్శించారు. ప్రభుత్వ సహకారంతో నిర్మితమవుతున్న పాఠశాల భవనాలు, నీటి సరఫరా విధానం, గిరిజనులు పండిస్తున్న పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పరిశీలనలో పొట్టంగి సమితి అభివృద్ధి అధికారి సౌమ్యసార్థక మిశ్రా, జిల్లా సాంస్కృతిక అధికారి ప్రత్యూష జెన్నా, కాశీప్రసాద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒడిశా కార్మికుడి మృతి

పద్మనాభం: మండలంలోని మద్దిలో కొత్తగా వేస్తున్న రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిశా కార్మికుడు మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. మద్ది ఇటుక బట్టీలో కార్మికుడిగా పనిచేస్తున్న ఒడిశా వ్యక్తి పద్మనాభంలో జరిగే బుధవారం సంతకు మోటార్ బైక్‌పై వెళ్తున్నాడు. మార్గం మధ్యలో మద్ది వద్ద కొత్తగా వేస్తున్న రోడ్డుపై వ్యాన్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒడిశా కార్మికుడికి తలపై బలమైన గాయాలయ్యాయి. చికిత్స కోసం విజయనగరం మహారాజా ఆస్పత్రిలో చేర్పించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

10 నుంచి వాసుదేవుని బ్రహ్మోత్సవాలు

మందస: బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవాలకు సమయం ఆసన్నమైంది. మందసలోని వాసుదేవపెరుమాళుని బ్రహ్మోత్సవాలు ఈ నెల 10 నుంచి 17 వరకు నిర్వహించాలని వేద పండితులు ముహూర్తం నిర్ణయించారు. 14వ బ్రహ్మోత్సవాల వివరాలను వేదపండితులు, ఆలయ ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసు కూర్మాచార్యులు బుధవారం వివరించారు. త్రిదండి చిన్నశ్రీమన్నారాయణ రామానుజజీయర్‌స్వామి, త్రిదండి అహోబిలరామానుజ జీయర్‌స్వామి, త్రిదండి దేవనాథరామానుజ జీయర్‌స్వామిల పర్యవేక్షణలో ఈ నెల 10న ఉత్సవాలు ప్రారంభమై 17వ తేదీతో ముగుస్తాయని చెప్పారు. ప్రతిరోజూ ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రత్యేక పూజలు, ఉపన్యాసాలు, సంకీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

ఉపాధ్యాయుడి ఆదర్శం



రక్తదానం చేస్తున్న ఉపాధ్యాయుడు సుశాంత్

మల్కన్‌గిరి: స్థానిక సమితిలోని సీక్‌పల్లి పంచాయతీ పుల్‌గూడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సుశాంత్ సాహు మంగళవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా స్వయంగా రక్తదానం చేయడంతో పాటు తన మరణాంతరం శరీరాన్ని మల్కన్‌గిరి ప్రభుత్వ స్పత్రికి అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. ఆస్పత్రి వైద్య నిపుణుల బృందంతో చర్చించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. సుశాంత్ సాహు ఉపాధ్యాయుడిగా మల్కన్‌గిరి జిల్లాలో 30 ఏళ్లుగా పని చేస్తున్నారు. ఈ ప్రాంతం, ప్రజలతో ఉన్న అనుబంధం విడదీయ లేనిదని, అందుకే మరణాంతరం కూడా వినియోగపడేలా భౌతిక కాయాన్ని వైద్య విద్యార్థుల ప్రయోగాలకు వినియోగ పడేలా నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆయనను తోటి ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు అభినందించి, సత్కరించారు.

ప్రతి ధాన్యం గింజా కొంటాం

నందిగాం: జిల్లాలో రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. బుధవారం నందిగాం, పెద్దతామరాపల్లి సచివాలయాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలను సందర్శించకపోవడంపై వెల్ఫేర్ అసిస్టెంట్లపై అసహనం వ్యక్తం చేశారు. నందిగాం సచివాలయానికి వెళ్లే మార్గంలో అపరిశుభ్ర వాతావరణం ఉండటంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో పలు అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మాణాల పూర్తయినా కాంట్రాక్టర్లు భవనాలను సిబ్బందికి అప్పగించడం లేదని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికే ప్రభుత్వం 3లక్షల 90వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందని, మరో 20 శాతం ధాన్యం మాత్రమే రైతుల వద్ద ఉందని చెప్పారు. వాటిని కూడా కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని చెప్పారు. ఇన్‌చార్జి తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఎంపీడీఓ హెచ్.వి.రమణమూర్తి, ఈఓపీఆర్డీ రాజారావు, మండల సర్వేయర్ జోగారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో భీష్మ ఏకాదశి



కేవుటివీధి ప్రసన్న వేంకటేశ్వరుని స్వామి తిరువీధి ఉత్సవం

పర్లాకిమిడి: భీష్మ(వైకుంఠ) ఏకాదశి సందర్భంగా పట్టణంలోని 9వ వార్డు కోమటి వీధిలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయాంలో బుధవారం భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుని మలయప్ప వాహనంలో తిరువీధి ఉత్సవం నిర్వహించారు. ఆలయం ప్రధానార్చకులు భద్రం కృష్ణమాచార్యులు, భద్రం చక్రధర్ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో భాగంగా స్వామివారి కల్యాణం, పంచహోమాలు, విశ్వక్సేన పూజలు చేపట్టారు. అలాగే కేవుటి వీధిలోని ప్రసన్న వేంకటేశ్వరునికి ప్రధానాచార్యులు ఎ.రాజగోపాలచారి ఆధ్వర్యంలో తిరువీధి ఉత్సవం జరిపారు. రాజవీధిలోని జగన్నాథ మందిరంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపారాధన చేశారు.

కిటకిటలాడిన ఆలయాలు..



రాయగడ: జగన్నాథ మందిరంలో భక్తుల సందడి

రాయగడ: భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని స్థానిక జగన్నాథ, బాలాజీ నగర్‌లోని వేంకటేశ్వర మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి మందిరాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. సుప్రభాత సేవలతో పాటు స్వామివారికి పూలాభిషేకం, పాలాభిషేకాలు నిర్వహించారు.



రాజవీధిలో ప్రత్యేక అలంకరణలో జగన్నాథుడు



జగన్నాథ మందిరంలో దీపారాధన చేస్తున్న భక్తులు

రూ.6.43 కోట్లతో రహదారుల నిర్మాణం



రహదారులను ప్రారంభిస్తున్న మంత్రి సరక

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితిలో సుమారు రూ.6.43 కోట్ల వ్యయంతో నిర్మితమైన నాలుగు రహదారులను రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక బుధవారం ప్రారంభించారు. సమితిలోని తలకంపర్, సుకుబడ, కొంథొ కొరోలో, ఏ కొరోలో, బగిరిజోల, ద్విముండి, సుకువాబడ, హడిగుడ తదితర గ్రామాలను అనుసంధానించే విధంగా రహదారులు నిర్మితమైనట్లు ఆయన తెలిపారు. స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు గడిచినా ఇంతవరకు ఈ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కలగలేదని గమనించిన ప్రభుత్వం.. ఆయా ప్రజల రాకపోకలను మెరుగు పరిచేందుకు ఈ సౌకర్యం సంకల్పించిదని వివరించారు. సమితిలోని అన్ని గ్రామాలలో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, ఎస్‌డీసీ చైర్‌పర్సన్ అనసూయ మాఝి తదితరులు పాల్గొన్నారు.

అటానమస్ కళాశాలలో క్రీడోత్సవాలు



క్రీడా జ్యోతిని తీసుకు వెళ్తున్న విద్యార్థులు, అధ్యాపకులు



పరేడ్ నిర్వహిస్తున్న విద్యార్థులు

రాయగడ: పట్టణంలోని అటానమస్ కళాశాలలో వార్షిక క్రీడోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం స్థానిక మజ్జిగౌరి మందిరం నుంచి విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు క్రీడోత్సవాలకు సంబంధించి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం క్రీడాజ్యోతిని ఊరేగింపుగా కళాశాల వరకు తీసుకువెళ్లారు. ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల మాజీ ప్రిన్సిపాల్ కుముద్‌చంద్ర మిశ్రా క్రీడల జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ఆటల్లో రాణించగలిగితే భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని తెలిపారు. చదువులో కూడా శ్రద్ధ కనబరచాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీకే గంతాయత్, గిరీష్‌చంద్ర పట్నాయక్ తదితరులు పర్యవేక్షించారు. అంతకుముందు విద్యార్థులు నిర్వహించిన పరేడ్ ఆకట్టుకుంది. గురువారంతో ఈ క్రీడల పోటీలు ముగియనున్నాయి.

గోవిందా.. గోవింద!

- టీడీపీలో యూజ్ అండ్ త్రో పాలసీ
- మామిడి గోవిందరావుకు షాక్ ఇచ్చేలా తాజా నిర్ణయాలు
- కార్యరూపం దాల్చిన అచ్చెన్న వ్యాఖ్యలు
- నెరవేరుతున్న కలమట వెంకటరమణ పంతం
- తన మాటే చెల్లుబాటు అవుతుందని చేతల్లో చూపించిన వైనం



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : తెలుగుదేశం పార్టీలో యూజ్ అండ్ త్రో పాలసీ మరోసారి తెరపైకి వచ్చింది. పాతపట్నం టీడీపీలో చేతిచమురుతో క్రియాశీలకంగా వ్యవహరించిన మామిడి గోవిందరావు విషయంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు గతంలో చేసిన వ్యాఖ్యలే నిజమయ్యాయి. పార్టీ కోసం ఎంత ఖర్చు పెడుతున్నా కూరలో కరివేపాకు మాదిరిగానే వాడుకుంటున్నట్టు మరోసారి స్పష్టమైంది. మామిడి వెంట తిరుగుతున్న వారిపై వేధింపులు ప్రారంభించి.. తనను కాదని వెళ్లితే టార్గెట్ చేయక తప్పదని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి కలమట వెంకటరమణ తన చేతల ద్వారా చూపిస్తున్నారు. అధినేతలు తన మాటకే విలువ ఇస్తారని టీడీపీ కేడర్‌కు సంకేతాలు ఇస్తున్నారు. ఇప్పుడీ వ్యవహారం పాతపట్నం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

కేడర్‌కు వేధింపులు..

టీడీపీలో డబుల్ గేమ్ నడుస్తోంది. మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, మరో నేత మామిడి గోవిందరావు మధ్య ఆసక్తికర పోరు నడుస్తోంది. వచ్చే ఎన్నికల్లో తనకే టిక్కెట్ వస్తుందనే విధంగా గోవిందరావు దూకుడుగా వెళ్తున్నారు. టీడీపీలో ఉన్న అరకొర కేడర్‌ను నయానో భయానో తనవైపు తిప్పుకుంటున్నారు. దీంతో అక్కడ పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న కలమట వెంకటరమణ ఉనికి తగ్గింది. అటు లోకేష్‌ను, ఇటు చంద్రబాబును తరుచూ కలుస్తూ, వాటికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వదులుతూ గోవిందరావు హడావుడి చేస్తున్నారు. అధిష్టానం వద్దే మామిడికే ప్రాధాన్యత ఉందని టీడీపీలో ఉన్న కార్యకర్తలు ఒక్కొక్కరిగా మామిడి వైపు వస్తున్నారు. ఈ పరిణామాలను గమనించిన కలమట ..ఇంకా వదిలేస్తే తన అస్తిత్వానికే ముప్పు తప్పదని గ్రహించి యాక్షన్‌లోకి దిగారు. కేడర్ చేజారిపోకుండా జాగ్రత్తపడ్డారు. తన నుంచి వెళ్తున్న నాయకులు, కార్యకర్తలపై వేధింపులు మొదలుపెట్టారు. పార్టీ పదవులుండి...మామిడి వెంట వెళ్తున్న నాయకులపై వేటు వేయిస్తున్నారు. దానికొక ఉదాహరణగా ఎల్ఎన్‌పేట పార్టీ అధ్యక్షుడిగా ఉన్న వెలమల గోవిందరావు తాజాగా మామిడి గోవిందరావు వెంట వెళ్లడంతో ఆయన పదవిని తొలగించారు. అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు, కూన రవికుమార్‌లకు చెప్పి హుటాహుటీన వెలమల గోవిందరావుకు ఉన్న మండల పార్టీ అధ్యక్ష పదవిని మెండ మనోహర్ అనే వ్యక్తికి కట్టబెట్టారు. దీంతో మామిడి వెంట ఉన్న వెలమల గోవిందరావు మరికొందరు నాయకులు ఎదురుదాడి చేసి కలమటపై ఆరోపణలు చేసినా అప్పటికే జరగాల్సిన డ్యామేజీ జరిగిపోయింది. ఇదంతా చూస్తుంటే నిమ్మాడలో అచ్చెన్నాయుడు చెప్పినట్టు మామిడి గోవిందరావును వాడుకోవడానికే తప్ప అంతకు మించి ఏమీ లేదన్న వ్యాఖ్యల్ని నిజం చేస్తున్నట్టుగా జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఆ రోజు..మామిడి గోవిందరావుకు టికెట్ ఇచ్చే ఆలోచన లేదని.. కలలో కూడా ఊహించొద్దని....నీ కోసం వాడుకోవడానికే ఉపయోగిస్తున్నానని.. వాడు పార్టీ కోసం డబ్బులిస్తున్నాడు.. తరుచూ చెక్‌లు తీసుకొచ్చి ఇస్తున్నాడు.. చెక్ కాదు కదా ఆస్తి రాసిచ్చినా పార్టీకి వాడుకుంటాం.. వాడుకోవాలన్నదే నా ఉద్దేశమని కలమట వెంకటరమణకు అచ్చెన్నాయుడు చెప్పిన మాటలు ఇప్పుడు గుర్తు చేస్తున్నాయి. మామిడి గోవిందరావు ఎంత ఖర్చు పెట్టినా, ఎవరి వద్దకు తిరిగినా మా మద్దతు నీకే అన్నట్టుగా కలమటకు అనుకూలంగా అధినేతలంతా వ్యవహరిస్తున్నారు. దీంతో పార్టీలో అంతర్గత పోరు మరింత ఎక్కువైనట్లయ్యింది.

సకాలంలో భూములకు నీరందించాలి

- అప్పర్ కొలాబ్ పాణీ పంచాయతీలో ఎమ్మెల్యే బాహిణీపతి



మాట్లాడుతున్న జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి

జయపురం: జిల్లాలో వ్యవసాయమే జీవనాధారంగా దాదాపు 80శాతం మంది గ్రామీణ ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారని, వారి పంట భూములకు సకాలంలో సాగునీరు సమకూర్చాలని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి కోరారు. జయపురం సత్తిగుడ డ్యామ్ సమీప సాగునీటి విభాగ కార్యాలయంలో ఒడిశా ప్రభుత్వ జలసంపద విభాగం నిర్వహించిన పాణి పంచాయతీ పక్షోత్సవాలను ఆయన ప్రారంభించారు. అప్పర్ కొలాబ్ ప్రధాన కాలువ కొలాబ్‌నగర్ ఇంజినీర్ సరోజ్‌కుమార్ సాహు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రబీ, ఖరీఫ్ సీజన్లలో రైతులకు సాగునీరు అందించడంలో పాణి పంచాయతీలు ప్రధాన భూమిక నిర్వహించాలన్నారు. జిల్లా వ్యవసాయ విభాగం అధికారి బిశురాజ్ రథ్ మాట్లాడుతూ సకాలంలో సాగునీరు విడిచి పెట్టడం వల్ల పంటల ఉత్పత్తి బాగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఇంద్రావతి, కొలాబ్ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ శత్రుఘ్న మహాపాత్రో, అప్పర్ కొలాబ్ బహుముఖ ప్రాజెక్ట్ అదనపు చీఫ్ ఇంజినీర్ బీకే రావు, పాణి పంచాయితీ కమిటీ అధ్యక్షుడు బాలకృష్ణ బిశాయి, కార్యదర్శి మన్మోహన పట్నాయక్, ధన్‌పూర్ కెనాల్ కమిటీ అధ్యక్షుడు సదాశివ పట్నాయక్, పద్మపూర్ కమిటీ అధ్యక్షుడు గంగాధర పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

ఆశా నిరాశల బడ్జెట్

- కేంద్ర బడ్జెట్‌పై సీఎం నవీన్ అసంతృప్తి



సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆశా, నిరాశల బడ్జెట్‌గా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వ్యాఖ్యానించారు. కేంద్రం బడ్జెట్‌లో కొన్ని ఆశలు, కొన్ని నిరాశలు ఉన్నాయని తెలియజేశారు. ఇందులో మూలధన పెట్టుబడులు, తాగునీరు, గ్రామీణ గృహాల నిర్మాణాల పెంపుదల పట్ల ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్రం సంకల్పించిన మిల్లెట్ మిషన్‌కు కేంద్ర బడ్జెట్‌లో ప్రాధాన్యత కల్పించడం విశేషంగా పేర్కొన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వంటి కొత్త టెక్నాలజీలపై దృష్టి సారించడం, బలహీన, ఆదివాసీ సముదాయాలకు ప్రాధాన్యత అభినందనీయన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధుల కుదింపు బీదల వర్గాన్ని ప్రభావితం చేస్తోందని విమర్శించారు. గత బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్లు కేటాయించగా కొత్త బడ్జెట్‌లో ఈ కేటాయింపు రూ.1.37 లక్షల కోట్లు కుదించారని, దీని వల్ల పేదలు, రైతులు నష్టపోతారని విచారం వ్యక్తంచేశారు. సేకరలో బడ్జెట్ కేటాయింపులు రూ.60 వేల కోట్లకు తగ్గించడంపై ముఖ్యమంత్రి విస్మయం చెందారు. గత ఆర్థిక సంవత్సరం (2021–22)లో దీని కోసం రూ.80 వేల కోట్లు కేటాయించినట్లు గుర్తు చేశారు. వరి విక్రయం పురస్కరించుకుని కనీస మద్దతు ధర లభించక రైతాంగం ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. వైద్యం, విద్యలో గ్రాంట్లు పెంచలేదని, కేంద్ర బడ్జెట్‌లో ఆయుష్మాన్ భారత్ కోసం నామమాత్రంగా రూ.7,200 కోట్లు కేటాయించారని ఎత్తి చూపారు. బిజూ స్వాస్థ్య కల్యాణ్ యోజన కోసం రాష్ట్రం సుమారు రూ.6 వేల కోట్లు ఖర్చు చేస్తోందని, దీనిపై ఒడిశా ప్రజల్లో అపోహలు ప్రేరేపించడం రాష్ట్ర బీజేపీ నాయకులు నివారించాలని సూచించారు.

కొండములగాంలో పులి సంచారం!

రణస్థలం: కొండములగాం పంచాయతీ ముక్తుంపురం గ్రామ సమీపంలోని పొలాల్లో నాలుగు రోజులుగా పెద్ద పులి సంచరిస్తోందనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. కొంతమంది ఈ ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు ఎక్కడిదో వీడియోను వాట్సాప్ యాప్‌లో, స్టేటస్‌ల్లో పెట్టి హడావుడి చేస్తున్నారు. దీంతో బంటుపల్లి, కమ్మసిగడాం, కొండములగాం, తిరుపతిపాలెం, పున్నానపాలెం గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

పుకార్లు నమ్మవద్దు : పులి సంచరిస్తున్నట్టు వచ్చిన పుకార్ల నేపథ్యంలో రణస్థలం అటవీ శాఖ సెక్షణాధికారి తలే శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి కొండములగాం పరిసర ప్రాంతాల్లో రెండు రోజులు పర్యటించారు. తొలుత కొంచాలబడి గ్రామానికి చెందిన పిషిణి చిన్నంనాయుడు పులిని చూసినట్టు పుకార్లు రావడంతో అతన్ని విచారించారు. ఆతను పులి పాదముద్రగా భావిస్తున్న అడుగును అటవీ అధికారులకు చూపించారు. అయితే చిన్నంనాయుడు చెప్పిన ఆనవాళ్లు, ఆ పాదముద్ర పెద్ద పిల్లికి చెందినది అయింటుందే తప్పా పులిది కాదని అధికారులు భావిస్తున్నారు. అలాగే ఆ పరిసర ప్రాంతాల్లోని నాలుగైదు కిలోమీటర్ల పరిధిలో రైతులు, గొర్రెలు, మేకల కాపరులతో కూడా అటవీ సిబ్బంది మాట్లాడారు. అయితే పులి సంచారం, అరుపులు, జంతువులను తిన్న జాడ లేదని వారు స్పష్టం చేశారు. ప్రజలు భయాందోళ చెందాల్సిన అవసరం లేదన్నారు. కచ్చితమైన ఆనవాళ్లు ఉంటే సమాచారం ఇవ్వాలని అటవీ అధికారులు సూచించారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు కోచ్‌గా హరికృష్ణ



కె.హరికృష్ణ

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ వాలీబాల్ పోటీలకు జిల్లాకు చెందిన శాప్ వాలీబాల్ కోచ్ కళ్లేపల్లి హరికృష్ణ కోచ్‌గా నియమితులయ్యారు. అసోం రాష్ట్రం గౌహతిలో ఈ నెల 2 నుంచి 9 వరకు జరగనున్న 71వ ఆలిండియా సీనియర్ నేషనల్స్ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా వాలీబాల్ జట్టుకు హరికృష్ణ కోచ్‌గా వ్యవహరించనున్నారు.

● వెలుగుల'నిద్దాం'

జి.సిగడాం మండలం నిద్దాం గ్రామంలో బుధవారం రాత్రి దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. 15 ఏళ్ల ఆనవాయితీని కొనసాగిస్తూ నిద్దాలమ్మ యాత్ర సందర్భంగా లక్షా 50 వేల ప్రమిదలు వెలిగించారు. ఇందుకోసం రెండు వేల కేజీల నూనెను వినియోగించారు. సుమారు మూడు కిలోమీటర్ల మేర దీపారాధన చేపట్టారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, శ్రీకాకుళం జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, కలిశెట్టి అప్పలనాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటరమణ, ఏర్నేన ప్రకాశరావు, సాధ్వీమణి తదితరులు పాల్గొన్నారు. – జి.సిగడాం



● శ్వేతగిరి..భక్తజన సిరి

భీష్మ ఏకాదశి సందర్భంగా బుధవారం జరిగిన శాలిహుండం యాత్ర భక్తజన సంద్రాన్ని తలపించింది. కాళీయ మర్దన వేణుగోపాలస్వామిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులతో శ్వేతగిరి కిటకిటలాడింది. రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలుడు, లక్ష్మీనసింహ స్వామి ఉత్సవమూర్తులను రెండు పల్లకిల్లో సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోని వంశధార నదికి తీసుకువచ్చి చక్రతీర్థ స్నానాలు నిర్వహించగా.. భక్తులు సైతం స్వామివారిని కనులారా వీక్షించి పవిత్ర స్నానాలు ఆచరించారు. –గార





క్లుప్తంగా

ఇసుకట్రాక్టర్ పట్టివేత



పినపెంకి జంక్షన్ వద్ద పట్టుకున్న ట్రాక్టర్

బాడంగి: మండలంలోని పినపెంకి వద్ద గలవేగావతినదిలోనుంచి అక్రమంగా ఇసుకతరలిస్తున్న ట్రాక్టర్‌ను స్థానిక ఎస్సై జయంతి బుధవారం మాటువేసి పట్టుకున్నారు. మెరకముడిదాం మండలం బుదరాయవలసకు చెందిన మాడుగుల గౌరి పినపెంకినుంచి ఆకులకట్ట వైపు ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ట్రాక్టర్‌ను ఇసుకతో సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌వద్ద భద్రపరిచామని తెలిపారు. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు.

ఇద్దరు ముద్దాయిలకు ఏడాది జైలు శిక్ష

బొబ్బిలి: పేకాట ఆడుతూ పట్టు బడి పోలీసులపై దాడిచేసిన ఘటనలో ఇద్దరు ముద్దాయిలకు ఏడాది పాటు జైలు శిక్ష, రూ.2 వేలు చొప్పున జరిమానా విధిస్తూ పీజేఎం కోర్టు మెజిస్ట్రేట్ ఎం సరోజమ్మ తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గున్నతోటవలస మామిడితోటలో 17వ తేదీ నవంబర్ 2019లో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతుండగా బొబ్బిలి పోలీస్ స్టేషన్ సిబ్బంది దాడిచేశారు. దీంతో పేకాట ఆడుతున్న వారిలో పారాది గ్రామానికి చెందిన కలిశెట్టి శశిభూషణరావు, బొబ్బిలి పట్టణంలోని కోరాడ వీధికి చెందిన రవ్వ శ్రీనుబాబులు కానిస్టేబుల్ మండంగి సూరయ్యపై దాడి చేశారు. దీంతో అప్పట్లో ఆ ఇద్దరు నిందితులపై కేసునమోదు చేశారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో ఇద్దరు ముద్దాయిలకు పై విధంగా శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు వెలువరించారు.

జిల్లాలో రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడి పర్యటన



కస్పా హైస్కూల్ మధ్యాహ్న భోజనశాల స్టోర్ రూంను పరిశీలిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బి.కాంతారావు

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బి.కాంతారావు బుధవారం జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలు, చౌక ధరల దుకాణాలు, దాసన్నపేటలోని పౌరసరఫరాల గిడ్డంగి, కస్పా స్కూల్‌లో జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. పట్టణంలోని నాగోజీపేట 511 అంగన్వాడీ కేంద్రంలో 5 గురు పిల్లలు మాత్రమే నమోదై ఉండగా గత ఐదు రోజుల్లో హాజరు పట్టికలో ఖాళీగా ఉండడాన్ని పరిశీలించి ఎందుకు హాజరు వేయలేదని ప్రశ్నించారు. పిల్లల హాజరు కాలేదని కార్యకర్త చెప్పగా ఆబ్సెంట్ వేయాలి కదా అన్నారు. అశ్రద్ధగా విధులు నిర్వహిస్తున్నారని చర్యలు తీసుకోవాలని పీడీ శాంతకుమారికి సూచించారు. కస్పా మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో పిల్లల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉడికించిన గుడ్డు, బంగాళదుంప కూర, వేరుశనగ చిక్కీ, వెజిటబుల్ రైస్‌ను పిల్లలకు వడ్డించారు. విద్యార్థుల హాజరు 50 శాతం కన్నా తక్కువగా ఉందని, పిల్లల్ని రప్పించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం స్టోర్ రూమ్‌లో ఉన్న స్టాక్‌ను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌తో పోల్చి 200 కేజీల బియ్యం తక్కువగా ఉన్నాయని గుర్తించి అందుకు గల కారణం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై సరైన వివరణ సమర్పించాలని ఆదేశించారు.

ఇకపై ప్రతి నెలా తనిఖీ

పౌరసరఫరాల గిడ్డంగిలో స్టాక్ వెరిఫికేషన్ చేశారు. రైస్, దాల్, ఆయిల్ నిల్వలను తనిఖీ చేశారు. సీజ్ చేసిన బస్తాలను తనిఖీ చేశారు. హమాలీలతో మాట్లాడి ప్రతి నెలా వేతనాలు చెల్లిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెల 10వ తేదీలోగా వేతనాలు చెల్లిస్తున్నారని హమాలీలు చెప్పారు. రికార్డులన్నీ అప్‌డేటెడ్‌గా ఉంచాలని ఇకపై ప్రతి నెల వస్తానన్నారు. ఆయన వెంట లీగల్ మెట్రాలజీ, పౌ రసరఫరాలు, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన జేఈఈ మెయిన్స్ పరీక్ష

- 3,124 మందికి 34 మంది గైర్హాజరు

విజయనగరం అర్బన్: ఐఐటీ, ఎన్ఐటీ వంటి ప్రతిష్టాత్మక ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు చేపట్టే జేఈఈ మెయిన్స్ ఆన్‌లైన్ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. ప్రతి రోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టులుగా నిర్వహించే పరీక్ష గత నెల 24న ప్రారంభమైంది. జిల్లాలో దరఖాస్తు చేసుకున్న 3,124 మందికి గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఉన్న ఐయాన్ డిజిటల్ జోన్, డెంకాడ మండలం చింతలవలసలోని ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షలు నిర్వహించారు. ఒక్కోపూట 225 మంది విద్యార్థులు మించకుండా నిర్వహించిన పరీక్షకు 34 మంది గైర్హాజరయ్యారు.

వెండి తెరపై మన నటులు

- నేడు విడుదల కానున్న ఎట్ పాతాళ భైరవి
- పూర్తిగా రాజాం పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ
- 1.58 గంటల నిడివితో సినిమా
- రూ. 40 లక్షలు పెట్టుబడితో రూపకల్పన



సినిమా షూటింగ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే కంబాల జోగులతో సన్నివేశం

రాజాం: సినిమా అనగానే ఒకప్పుడు మద్రాస్ గుర్తుకొచ్చేది. అనంతరం హైదరాబాద్ కేంద్రంగా మారింది. విశాఖపట్నం కూడా ఒక అంతర్భాగం అయ్యింది. ఇప్పుడు మన గ్రామీణ ప్రాంతాలు సినిమాలు తీసేందుకు అనుకూలంగా మారాయి. నిన్న జయమ్మ పంచాయతీ రాజాం నియోజకవర్గ పరిధిలో చిన్నయ్యపేట గ్రామంలో చిత్రీ కరించారు. ఎక్కడెక్కడ నుంచో నటీనటులు వచ్చారు. ఈ ప్రాంతానికి చెందిన ఒకరిద్దరికి అవకాశాలు కూడా వచ్చాయి. యాంకర్ సుమ నటించిన ఈ సినిమా బాగానే ఆడింది. ఇప్పుడు ఇదే కోవలో ఎట్ పాతాళ భైరవి తెరకెక్కింది. 90 శాతం సినిమా రాజాంతో పాటు పరిసర ప్రాంతాల్లో కెమెరాకు ఎక్కించారు. కేవలం 10 శాతం మాత్రమే దుబాయ్‌లో చిత్రీకరించారు. ఈ సినిమాలో 90 శాతం నటులు రాజాం పరిసర ప్రాంతాల్లోని వారు కావడం మరో విశేషం. కేవలం రూ.40 లక్షల బడ్జెట్‌తో తెరకెక్కించిన ఈ సినిమాకు రచయిత దివాకర్ తనయుయుడు శ్రీఖర్‌బాబు దర్శకత్వం వహించారు. బంకుపల్ల బరద్వాజ్, బిందుభైరవి, రాధాకృష్ణ తదితర హీరో, హీరోయిన్‌లతో పాటు మరికొద్దిమంది ఆర్టిస్టులు మాత్రమే ఇతర ప్రాంతాలకు చెందిన వారు. అరుణాచల శివ బ్యానర్‌పై నిర్మించిన ఈ సినిమాకు దగ్గుబాటి వరుణ్, సీహెచ్‌వీ అనంత్, కల్యాణ బాషిణి, పీవీజీకే రాజులు ప్రొడ్యూసర్లుగా వ్యవహరించారు.



గుళ్లసీతారాంపురం ఆలయం వద్ద స్థానిక నటులతో సన్నివేశం

రాజాం ఎమ్మెల్యే ప్రత్యేక పాత్రలో..

గ్రామీణ ప్రాంతాల్లో జీవన వైవిధ్యం, ఆచార సంప్రదాయాలు, ఆధునిక మేళవింపు తదితర అంశాలతో తెరకెక్కిన సినిమాలో రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, పలు అవార్డుల గ్రహీత గోకవలస కృష్ణమూర్తి, తృప్తిరిసార్ట్ యజమాని మురళీమాస్టరు వంటివారు నటించారు. పట్టువర్ధనం, బాగేంపేట, గుళ్లసీతారాంపురం, మెరకముడిదాం, పెరుమాళి ప్రాంతాలకు చెందిన వారికి సినిమాలో నటించే అవకాశం దక్కింది. 1.58 గంటల నిడివి ఉన్న ఈ సినిమాను 50 రోజుల వ్యవధిలో పూర్తి చేశారు. రాజాంలోని సీతారామ థియేటర్‌లో ఈ నెల 3 నుంచి సినిమా ప్రదర్శితంకానుంది.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ అప్పారావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు

విజయనగరం ఫోర్ట్: విద్యార్థులు మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు హితవు పలికారు. స్థానిక ఫోర్ ఎస్ కళాశాలలో విద్యార్థులు-మాదక ద్రవ్యాల వినియోగం అన్న అంశంపై బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రతి జిల్లాలో జాతీయ, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ వారి సూచనలతో సమీక్ష సమావేశాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. పిల్లలు, విద్యార్థుల్లో మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగం నిలవరించడంలో జిల్లాలోని అన్ని శాఖల సమన్వయం ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. పాఠశాలలు, వివిధ హాస్టల్స్ సమీపంలో మద్యం దుకాణాలు, బార్లు లేకుండా ఎక్సైజ్, పోలీస్, విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ జి. హిమబిందు, సభ్యులు భవాని, సుధారాణి, జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ, యాళ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల అభ్యున్నతికి కృషి

- డీజీఎం దాలినాయుడు

విజయనగరం టౌన్: బీఎస్ఎన్ఎల్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల అభ్యున్నతికి పూర్తిస్థాయిలో కృషిచేస్తానని డిప్యూటీ జనరల్ మేనేజర్ దోనూరి దాలినాయుడు పేర్కొన్నారు. డీజీఎంగా బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు డీజీఎంను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన సేవలందిస్తామని చెప్పారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని హామీఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఆలుగు వెంకటరావు, కోశాధికారి తామాడ కృష్ణకుమారి, కార్యదర్శి వైహెచ్ఎస్. పాపారావు, ప్రతినిధులు రవిరాజు, భాను, శకుంతల, రేవెళ్ల రమణమ్మ, లక్ష్మణకుమార్, తులసి, ఎం.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం

గరివిడి(చీపురుపల్లి రూరల్): మండలకేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తిని రైలు ఢీకొట్టడంతో మరణించినట్లు రైల్వే ఎస్సై చెల్లూరి శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. మృతి చెందిన వ్యక్తికి సుమారు 35 ఏళ్లు ఉంటాయని, నలుపురంగు చొక్కా ధరించాడని చెప్పారు. ఇతర వివరాలకు ఫోన్ 7013273731 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అన్నదాత సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



గిరిజన రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

రామభద్రపురం/బొబ్బిలి: అన్నదాత సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతులకు అన్ని విధాలా ప్రభుత్వం అండగా ఉంటుందని కలెక్టర్ సూర్యకుమారి అన్నారు. రామభద్రపురం, బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయాలలో బుధవారం ఆమె ఈ క్రాప్ పంటల నమోదుపై సూపర్ చెక్ చేశారు. మండలం పరిధిలోని కొండకెంగువ, జీరికవలస, జన్నివలస గ్రామాలకు చెందిన రైతులు పండించిన పంటలకు ఈ క్రాప్ అయిందా లేదా?.ఏఏ పంటలు వేశారు?పంట కొచ్చిందా లేదా?పంటలు అమ్ముడవుతున్నాయా లేదా?అని ఆయా గ్రామాల రైతులను ఆరా తీశారు. అలాగే పిల్లలంతా పాఠశాలలకు వెళ్తున్నారా? అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం గుడ్లు, చిక్కీలు ఇస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా 104తో వైద్యాధికారులు గ్రామాలకు వచ్చి వైద్యపరీక్షలు చేస్తున్నారా? అవసరమైన రోగులకు ఉచితంగా మందులు ఇస్తున్నారా? అని ప్రశ్నించారు. ప్రతిరోజూ పిల్లలను పాఠశాలలకు పంపించాలని, మధ్యలో చదువులు ఆపకూడదని, ఏ సౌకర్యాలు కావాలన్నా ప్రభుత్వం కల్పిస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. జీరికవలస తదితర గ్రామాల్లో పలువురు ఇంటర్‌మీడియట్ చదివి మధ్యలో ఆపేశారని ఆ గ్రామ యువకుడు బోయిన ప్రవీణ్ కలెక్టర్ సూర్యకుమారికి తెలపగా..అక్కడ ఎంత మంది ఉన్నారో గుర్తించి వృత్తి విద్యా శిక్షణ ఇప్పించాలని ఎంపీడీఓ రమామణిని ఆదేశించారు.

ఆర్బీకే ద్వారా కొనుగోలు

ఈ సమయంలో ఉలవ పంట ఎక్కువగా పండిస్తున్నామని, వ్యాపారులు గ్రామాలకు వచ్చి కొనుగోలు చేస్తున్నారని గిరిజన రైతులంతా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయాభివృద్ధే లక్ష్యంగా రైతులకు అన్ని విధాలా అండగా ఉండేలా ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతుందని చెప్పారు. అందులో భాగంగానే ఈ క్రాప్ పంటల నమోదు కార్యక్రమం అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో శేషశైలజ, ఇన్‌చార్జి తహసీల్దార్ సుబ్బారావు, ఎంఈవో తిరుమలప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లాకు పతకాలు



రాష్ట్రస్థాయి పోటీల్లో సాధించిన పతకాలతో జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన తైక్వాండో పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు సత్తా చాటారు. గత నెల 29, 30, 31 తేదీల్లో అనకాపల్లిలో జరిగిన పోటీల్లో పాల్గొన్న జిల్లా క్రీడాకారుల బృందం 167 పాయింట్లతో ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో ప్రథమస్థానం దక్కించుకుంది. అంతేకాకుండా పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు 20 బంగారు పతకాలు, 12 రజిత పతకాలు, 14 కాంస్య పతకాలు సాధించినట్లు జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ చారి ప్రసాద్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన



నిరసన తెలుపుతున్న దుడ్డుఖల్లు గ్రామస్తులు, గిరిజన సంఘాల నాయకులు

- ఆశ్రమ పాఠశాల డిప్యూటీ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్

గుమ్మలక్ష్మీపురం:

విచారణ పేరుతో గిరిజనుడైన కొండగొర్రి కామరాజును తీవ్రంగా కొట్టి ఆస్పత్రి పాలు చేసిన ఎల్విన్‌పేట పోలీసులతో పాటు కామరాజుపై దొంగతనం నేరం మోపిన గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల డిప్యూటీ వార్డెన్‌పై చర్యలు తీసుకుని బాధితుడికి న్యాయం చేయాలని దుడ్డుఖల్లు గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గిరిజన సంఘాల నాయకులు నిమ్మక సింహాచలం, పువ్వల తిరుపతిరావు, కోలక అవినాష్, మండంగి రమణ, శ్రీను, గంగునాయుడు, సీతారాం తదితరులతో కలిసి బాధితుడు కామరాజు కుటుంబీకులు, గ్రామస్తులు బుధవారం గుమ్మలక్ష్మీపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామరాజు, అతని భార్య పార్వతి ఆశ్రమ పాఠశాలలో పనిచేసేందుకు రోజుకు రూ.150 కూలి కోసం వార్డెన్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారని, వారితో సుమారు మూడేళ్లు పనిచేయించుకున్నప్పటికీ కూలి సొమ్ము చెల్లించలేదన్నారు. దీంతో వారు పనికి వెళ్లడం మానేసి, తమకు బకాయి పడిన కూలి ఇవ్వాలని అడగడంతో డబ్బులివ్వకుండా..ఆశ్రమ పాఠశాల ఆవరణలో ఉన్న జనరేటర్‌ను దొంగతనం చేశాడంటూ ఎల్విన్‌పేట పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేశారని చెప్పారు. ఆ ఫిర్యాదుపై స్పందించిన పోలీసులు కామరాజును విచారణ కోసమని పోలీస్‌స్టేషన్‌ను పిలిపించి తీవ్రంగా కొట్టడంతో తీవ్ర అస్వస్థతకు గురైన కామరాజును 108 అంబులెన్స్‌లో తరలించి పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చేర్చామన్నారు. సమగ్ర విచారణ జరపకుండా కామరాజును తీవ్రంగా కొట్టిన పోలీసులతో పాటు కూలి సొమ్ము చెల్లించకుండా తప్పుడు నేరారోపణ చేసిన డిప్యూటీ వార్డెన్‌పై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ జె.రాములమ్మతో పాటు ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు.

పండిన ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తాం

- ఓర్వలేకే తప్పుడు ప్రచారం చేస్తున్నారు
- వారం రోజుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ ఖాళీల భర్తీ
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం గంటస్తంభం: రైతులు విక్రయానికి సిద్ధం చేసిన ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. జెడ్పీ చైర్మన్ అధ్యక్షతన జెడ్పీ సమావేశ భవనంలో బుధవారం నిర్వహించిన 1, 2, 4, 7 స్థాయీ సంఘ సమావేశాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం, వైద్యం, ప్రజారోగ్యం, విద్య, గృహనిర్మాణం, సమగ్ర శిక్ష, పంచాయతీ తదితర శాఖల లక్ష్యాలు, ప్రగతిపై చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ దళారుల ప్రమేయం లేకుండా రైతులకు మద్దతు ధర చెల్లించి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు వెల్లడించారు. కేవలం పది రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బు జమవుతున్నాయని చెప్పారు. రైతులు ఎంతో సంతృప్తిగా ఉండడాన్ని చూసి ఓర్వలేక, ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలన్న ఉద్దేశంతో కొందరు టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రైతుల వద్ద మిగిలిపోయిన ధాన్యాన్ని కూడా పూర్తిగా కొనుగోలు చేస్తామని స్పష్టంచేశారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. రెండు జిల్లాల్లో ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులను వారం రోజుల్లో భర్తీ చేయాలన్నారు. పంచాయతీలకు మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులు, వాటి వినియోగం, పాఠశాలల మ్యాపింగ్, నాడు-నేడు ఫేజ్-2 పనుల ప్రగతిపై చర్చించారు. ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలపై ఆరా తీశారు. జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు అధ్యక్షతన 3వ స్థాయి సంఘ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వ్యవసాయంతో పాటు, పశు సంవర్ధకం, పట్టు తదితర వ్యవసాయ అనుబంధ శాఖలపై చర్చించారు. గొర్రెలు, మేకలకు పారుడు వ్యాధి రాకుండా పీపీఆర్ వ్యాక్సిన్ వేస్తున్నామన్నారు. వైఎస్సార్ సంచార పశు ఆరోగ్యకేంద్రం కింద ప్రతీ నియోజకవర్గానికి రెండో వాహనాన్ని మంజూరు చేసినట్టు వెల్లడించారు. జెడ్పీ రెండో వైస్ చైర్మన్ కొత్రజన్ని సింహాచలం అధ్యక్షతన 6వ స్థాయీ సంఘం, బొబ్బిలి జెడ్పీటీసీ సభ్యురాలు శాంతకుమారి అధ్యక్షతన 5వ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించి, ఆయా శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. సమావేశాల్లో ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, జెడ్పీ సీఈఓ డాక్టర్ ఎం.అశోక్‌కుమార్, డిప్యూటీ సీఈఓ కె.రాజ్‌కుమార్, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల అధికారులు, ఆయా కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

కమనీయం.. రాములోరి కల్యాణం

నెల్లిమర్ల రూరల్:



సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో సీతారాముల తిరుక్కల్యాణ మహోత్సవం బుధవారం కనులపండువగా సాగింది. పవిత్ర భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని స్వామివారి తిరుక్కల్యాణోత్సవాన్ని అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలో వేకువజామునుంచే కల్యాణ మహోత్సవ సందడి ప్రారంభమైంది. ముందుగా రామకోనేరు పవిత్ర జలంతో ఆలయాన్ని శుద్ధిచేశారు. అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్, పవన్ కుమార్ తదితరులు స్వామివారికి ప్రాతఃకాల అర్చన గావించి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 8 గంటలకు శ్రీమద్రామాయణపారాయణం, వేదపఠనం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం యాగశాలలో గంటన్నర సమయం పాటు విశేష హోమాలను జరిపించారు. సాయంత్రం 5గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అగ్నిప్రతిష్టాపన, బలిహరణం నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణం చేపట్టి సమస్త దేవతామూర్తులను స్వామివారి కల్యాణానికి ఆహ్వానించారు. మంగళవాయిద్యాలు, అర్చకుల వేద మంత్రోచ్ఛరణ నడుమ సీతారామలక్ష్మణులను పట్టువస్త్రాలు, వివిధ రకాల స్వర్ణాభరణాలతో సుందరంగా అలంకరించారు. రాత్రి 7 గంటలకు హంస, అశ్వ, గరుడ వాహనాలపై ఉత్సవ విగ్రహాలను రామతీర్థం పుర వీధుల్లో ఊరేగింపుగా తీసుకువెళ్లి మూడువాహనాల సేవను జరిపించారు. ఈ ఊరేగింపులో భాగంగా సీతమ్మవారి వాహనం, శ్రీరాముడి వాహనాలు ఎదురుపడినపుడు అర్చకులు వేద మంత్రాలతో తిరుక్కల్యాణ విశిష్టతను భక్తజనులకు చాటిచెప్పారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను కల్యాణ మండపానికి తీసుకువచ్చి స్వామివారి వివాహ మహోత్సవాన్ని ప్రారంభించారు. ఆచారంగా ఏకుల కుటుంబీకులు పట్టువస్త్రాలు, పూజా సామగ్రిని స్వామివారికి సమర్పించారు.



రాములోరి కల్యాణ వేడుక



సీతారామస్వామిని దర్శించుకుంటున్న ఎంపీపీ అంబళ్ల సుధారాణి, శ్రీరాములనాయుడు దంపతులు

భక్తిశ్రద్ధలతో కల్యాణోత్సవం...

సీతా సమేత రామస్వామి వారిని ఆస్థాన కల్యాణ మండపంలోనికి వేంచింపజేసి ముందుగా విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం గావించి అనంతరం గణపతి పూజను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అర్చకస్వాముల వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సీతమ్మవారి శిరస్సుపైన జీలకర్ర బెల్లం పెట్టించి సీతారాముల తిరుక్కల్యాణాన్ని అత్యంత వైభవోపేతంగా జరిపించారు. సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి రాములోరి కల్యాణాన్ని కనులారా తిలకించారు. రామ క్షేత్రమంతా భక్త పారవశ్యంతో పులకించిపోయింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఎంపీపీ అంబళ్ల సుధారాణి, రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు దంపతులు స్వామివారిని దర్శించి పూజాసామగ్రి అందజేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సై నారాయణరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించారు. భక్తులకు దేవస్థాన సిబ్బంది ఉచిత ప్రసాదాన్ని అందించారు.